**LOVE TALKED ABOUT IS TURNED ASIDE; LOVE DEMONSTRATED IS IRRESISTIBLE!**

**కథ**

# నీతో కలిసి ఏడడుగులు

''ట్రెనింగ్ బాగా జరిగిందా?'' అడిగింది సౌరభ. కనుబొమ్మల్నెగరేసి, తల ఊపాడు పూజిత్-బాగా జరిగిందన్నట్టు.

రాంచీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లీగల్ మెట్రాలజీ లో నాల్గు నెలల ట్రెనింగ్ తర్వాత ఆరోజే వచ్చాడతను-తూనికలు కొలతలశాఖలో ఇన్‌స్పెక్టర్‌గా రిక్రూట్ అయ్యాక.

''పోస్టింగ్ ఎక్కడ?'' అడిగింది సౌరభ.

''వరంగల్''

''వరంగలా?''

''అవును. ఎల్లుండి బయల్దేర్తున్నాను''

''అదికాకుంటే ఇంకెక్కడికైనా మార్చుకోడానికి వీలు పడదా?''

''ఊహు. అయినా ఎందుకంత భయపడ్తున్నావ్? నక్సలైట్-ఇన్‌ఫెస్టెడ్ అనా?'' ఆమె తల ఊపింది అవునన్నట్టు.

''అవును సౌరభా, అసలు నీకూ నాకూ మధ్య ఏ రిలేషన్‌షిప్ ఉందని అంతగా ఆందోళన పడిపోతున్నావ్?''

వాళ్ళిద్దరూ డిగ్రీలో క్లాస్‌మేట్స్. ఈ మధ్యనే కాలేజీ చదువు ముగిసింది. ఆమె ఎం.సి.ఏ కి ప్రవేశ పరీక్షరాసి ఉంది. అతనికేమో ఈ ఉద్యోగం వచ్చింది. కాలేజీలో ఉన్నప్పటి నుంచే, సౌరభ అతన్ని మనస్ఫూర్తిగా ప్రేమించింది. అతన్లోని జాలిగుణం, అభాగ్యుల్ని ఆదుకోవాలనే ఆరాటం, ఆమెకు ఎంతో నచ్చాయి. కానీ పూజిత్‌కి ఈ ప్రేమల పట్ల నమ్మకం లేదు. అన్నీ ఆకర్షణలేననీ, అపరిపక్వపు ఇన్‌ఫాచ్యుయేషన్లేననీ అతని అభిప్రాయం. అందుకే, ఆమె ఎన్నోసార్లు తన మనసును అతని ముందు పరచి 'అయ్ లవ్ యు' అని చెప్పినా, అతను మాత్రం 'అయ్ లవ్ యు టు!' అని బదులివ్వలేదు ఇంతదాకా!

''ఇంకా నీకు నా ప్రేమమీద నమ్మకం కుదరకపోవడం నా దురదృష్టం పూజిత్'' అంది సౌరభ. ఆమే మళ్ళీ అడిగింది. ''వరంగల్‌కి ఎల్లుండా బయల్దేరేది?''

''అవును''

''అయ్ లవ్ యు మోర్ టు డే దేన్ ఎస్టర్ డే!''

''ఇన్‌ఫాచ్యుయేషన్ అనేది కామన్ కోల్డ్ లాంటిదిట. దానంతట అదే, కోర్సు పూర్తవగానే తగ్గిపోతుంది!''

★★★

జూన్ 19, 1999.

రైల్వేస్టేషన్‌లో పూజిత్‌కి వీడ్కోలు చెప్పడానికి వచ్చింది సౌరభ. ''ఇన్‌స్పెక్టర్స్‌కి యూనిఫామ్ వేసుకునే వెళ్తారా మీరు?'' అడిగింది. అతను వరంగల్‌లో పోస్ట్ చేయబడ్డాడని తెలిసినప్పటి నుండీ ఆమెకు చాలా బాధగా, అస్థిమితంగా ఉంది. ''అవును ఏం?'' అడిగాడు. దానికేం చెప్పాలో తెలీనట్లు మౌనంగా ఉండిపోయింది.

''చూడు సౌరభా! మనం ఏ పనినైనా పూర్తి కమిట్‌మెంట్‌తో చేయాలి. అక్కడి కొన్ని పల్లెటూళ్ళల్లో, కొందరు వ్యాపారులు హైటెక్ మోసాలతో అమాయకుల్ని దగా చేస్తున్నారు. అలాంటి వారికి మా అవసరం ఉంటుంది. వాళ్ళలా మోసగించబడకుండా, సరైన తూనికలతో, తాము చెల్లించే ధరకు తగిన వస్తువు వారికి లభించేలా చూసే బాధ్యత నామీద ఉంది. దే నీడ్ మీ'' అదిగో ఇతరులకు ఉపయోగపడాలనే ఆ గుణమే అతనంటే విపరీతమైన ఆరాధనను నింపుతుందామెలో.

''కానీ, పూజిత్, ఇక్కడ నాక్కూడా నువ్వు కావాలి''

ఆ మాట అంటున్నప్పుడు ఆమె కళ్ళల్లోకి చెమ్మ ఊరడం అతను గుర్తించాడు.

'నువ్వనుకునేలా, ఈమెది ఆకర్షణాకాదు ఇన్‌ఫాచ్యుయేషనూ కాదోయ్. స్వచ్ఛమైన ప్రేమే!' అన్న భావాన్ని ఆ కన్నీటి చెమ్మ దాచుకుందని అతను తెల్సుకోబోతున్నాడు! చాలా కొద్దిరోజుల్లోనే!!

★★★

వరంగల్, జూలై 16, 1999

రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఉన్న ఒక ప్రముఖ సిమెంటూ ఐరన్ వ్యాపారి మీద రెయిడ్ చేసి, అక్కడ తూనికల్లో జరుగుతున్న అక్రమాల్ని పసిగట్టి, పకడ్బందీగా కేస్ ఫైల్ చేశాడు పూజిత్. ఆ కేస్‌కి సంబంధించిన వివరాల్ని డీసీతో చర్చించి తన గదికి వచ్చి కూర్చుని, తన అసిస్టెంట్‌ని పిలిచాడు. ''జలీల్! జీప్ రెడీగా ఉందా? జీతమ్మడపల్లికి వెళ్తున్నాం మనం. డిస్ట్రిక్ట్ ఇన్‌స్పెక్టర్ గారూ వస్తున్నారు. రెండు మూడు కంప్లెయింట్స్ ఉన్నాయి అక్కడ'' చెప్పాడు.

''రెడీనే సార్'' చెప్పాడు జలీల్.

ఆ ప్రయాణం ఒక నైట్‌మేర్ కాబోతుందని ఊహించలేదా ఇద్దరూనూ!

★★★

వరంగల్‌కి సుమారు యాభై కిలోమీటర్ల దూరంలో ఉంది జీతమ్మడపల్లి అనే కుగ్రామం. జఫర్‌గడ్ దాటి వేగంగా వెళ్తోంది జీప్. పూజిత్, డీ.ఐ ప్రకాశరావులు యూనిఫార్మ్‌లో ఉన్నారు. డ్రైవరు సీతారాం జాగ్రత్తగా నడుపుతున్నాడు వాహనాన్ని. కిరసనాయిలు, ధాన్యం వ్యాపారం చేసే ఓ వ్యక్తి మీద రెయిడ్ కోసం వెళ్తున్నారు వాళ్ళు. జీప్ జఫర్‌గడ్ దాటిన ఐదు నిమిషాలకి, వాళ్ళను గమనిస్తున్న ఒక వ్యక్తి, దగ్గర్లో ఉన్న టెలిఫోన్‌బూత్‌కి వెళ్ళి ఒక నంబర్ నొక్కాడు. ఆ వ్యక్తికళ్ళు తేనెరంగులో ఉన్నాయి.

''అన్నా! పోలీస్ జీప్ వస్తోంది. మొత్తం నలుగురున్నారు లోపల..''

★★★

''ఏమయ్యా పూజిత్! ఎలా ఉంది జాబ్? ఇదంతా నక్సల్స్ ఏరియా..భయంగా లేదా?'' అడిగాడు డి.ఐ. ప్రకాశరావు జీప్ వెళ్తుండగా.

''జాబ్‌కేం సార్. బావుంది. కాకపోతే అప్పుడప్పుడూ కొన్ని పొలిటికల్ వొత్తిళ్ళు..''

''వెళ్ళేప్పుడు? సీతారాం..కొంచెం స్లోగా వెళ్ళు, రోడ్ బాగా లేదు''

''కాలేజ్‌లో నా క్లాస్‌మేట్ ఒక అమ్మాయి నన్ను ప్రేమిస్తున్నానంటోంది సర్ కానీ, నాకీ ప్రేమ వ్యవహారాల మీద అట్టే నమ్మకం లేదు. అంతా ట్రాష్! నిజంగా ఆమె ప్రేమ సిన్సియర్ అని నేను నమ్మగలిగితే ఆ అమ్మాయినే చేసుకుంటాను.''

''మంచిది''

సరిగ్గా అప్పుడు-ఒక పెద్ద చప్పుడు! కళ్ళను కమ్మేస్తూ, తుఫానులా దుమ్ము...

★★★

విజయవాడలో-తన గదిలో కూర్చుని కంప్యూటర్ నోట్స్‌లో పూజిత్ ఫోటోని చూస్తోంది సౌరభ. వరంగల్ చుట్టుప్రక్కలంతా నక్సల్స్-ప్రోన్. ఎప్పుడూ ఎన్‌కౌంటర్లు, హత్యలే-భగవంతుడా! నా పూజిత్‌కేం కాకుండా చూడు! ఆ ఫోటోని యదకు హత్తుకుంది.

★★★

మందు పాతర పేలిన ధ్వని చాలా భయానకంగా వినిపించింది. అది ఎంత తీవ్రంగా ఉందంటే, జీప్ నాలుగైదు అడుగులు గాలిలోకి ఎగిరిపడింది. బ్లాస్ట్‌లో తునాతునకలైన జీప్ తాలూకు ఏ భాగమోగానీ, పూజిత్ పిరుదులలో దిగి తొడలోంచి తొలుచుకుని వచ్చి మడమకి కొంచెం పైన కుడికాలుని విరిచేసింది! జలీల్ శరీరం రెండుగా తెగిపోయింది. ప్రకాశరావు కాలు నుజ్జునుజ్జుగా అయిపోయింది. చిత్రంగా, డ్రైవర్ సీతారాంకి ఏం కాలేదు. పూజిత్‌కి ముందు బాధేమీ తెలీలేదు. జీప్ నుంచి దిగాలని కదిలాడు. కానీ వీలుకాలేదు! సీట్‌మీదకు వెనక్కు వాలిపోయాడు. చూపు కాళ్ళవైపు తిరిగేసరికి భయంతో కంపించిపోయాడు. ఒక చిన్న చర్మపు ముక్కమాత్రమే వేలాడుతోంది అతని కుడిపాదాన్నీ, మడమనీ కలిపి! అరిపాదం నేలవైపునకు కాక, అతని ముఖం వైపుకి తిరిగి



పోయి ఉంది! ఎడమ పాదం మీద చర్మం మొత్తం వొలిచేసినట్లుగా అయిపోయింది.

అతనికి సౌరభ జ్ఞప్తికి వచ్చింది!

'నో! నేను చనిపోకూడదు..' అతను అనుకున్నాడు '..అయ్ డోన్ట్‌వాన్ట్‌టు డై..! నాట్ హియర్! నాట్ లైట్ దిస్!'

★★★

జూలై 17, రాత్రి 10.00

విజయవాడ రైల్వేస్టేషన్లో నెర్వస్‌గా ఎదురుచూస్తోంది సౌరభ. 'తన కెదురవ్వబోయేది ఎంతటి ఘోరమైన పరిస్థితైనా ఎదుర్కోవడానికి సిద్ధపడి ఉండాలి. అంతేకాని షాక్‌ని కనపడనీయకూడదు!' తనకు తాను చెప్పుకుంటోంది.

శాతవాహన ఎక్స్‌ప్రెస్ వచ్చింది.

పూజిత్‌ని చూడగానే పరిగెత్తుకు వెళ్ళింది. అతని కళ్ళు బాగా లోతుకి పీక్కు పోయి ఉన్నాయి.

''సౌరభా..'' అతను ఉద్విగ్నంగా పిలిచాడు. ''...నా కాలు తీసేసారు వాళ్ళు''

సౌరభ అతని నుదుటి మీద చేయి వేసింది లాలనగా.

''ఇంకా నన్ను ప్రేమిస్తున్నావా?'' అడిగాడు.

''అవును. అయ్ లవ్ యు'' స్థిరంగా ఉంది ఆమె కంఠస్వరం.

★★★

విజయవాడ నాగార్జున హాస్పిటల్స్‌లోగానీ, పూజిత్ గాయాల తాలూకు పూర్తి స్వరూపం బయటపడలేదు.

అతని కుడి కాలు మోకాలు క్రిందికి యాంప్యుటేట్ చేయబడింది. ఎడమపాదం పచ్చి మాంసం ముద్దలా ఉంది! భరించలేని బాధలో ఒక్కోసారి అతను డెలీరియస్‌గా ఐపోయి సౌరభ చేతిని గట్టిగా పట్టుకునేవాడు. బెడ్‌ప్యాన్స్, చెమటతో తడిసిన షీట్స్‌ని మార్చడం, ఇదే సౌరభ లోకం అయిపోయింది. ఇంట్రావీనస్ ద్రవాల్ని ఎక్కించడం కూడా నేర్చేసుకుం

గుమ్మడి రవీంద్రనాథ్

దామె. అలసటగా, అనుకునేది ''మైగాడ్! దీన్ని భరించగలిగితే, జీవితంలో దేన్నైనా భరించ వచ్చు!''

★★★

జూలై, 23న ఒక ఆర్థోపీడిక్ సర్జన్, పూజిత్‌ని పరీక్షించి వెళ్ళాడు, ఆ డాక్టరు వెళ్ళిపోయాక పూజిత్ చెప్పాడు. ''సౌరాభా! నువ్వు నాతో చాలాసార్లు అయ్ లవ్ యు అని చెప్పావు. అయినా ఫరవాలేదు. నువ్వు వేరే ఎవర్నైనా పెళ్ళి చేసుకోవచ్చు.''

''లేదు పూజిత్, నా పెళ్ళి నీతోనే! అది జరిగి తీరుతుంది. మనం తప్పకుండా పెళ్ళి చేసుకుంటాం దయ చేసి ఎప్పుడూ వేరే ఎవర్నైనా చేసుకో అనే మాటలు చెప్పొద్దు. ప్లీజ్. నువ్వు నిజంగా అనుకుంటున్నావా, నేను నిన్ను తప్ప వేరే ఎవర్నైనా పెళ్ళి చేసుకుంటానని?''

అతనేమీ చెప్పలేదు. ఇద్దరూ ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకున్నారు కొన్నిక్షణాలు. ఆ నిశ్శబ్దంలోంచి అతను అన్నాడు.

''నిన్ను పొందే అర్హత నాకుందా ఇ...ప్పు...డు?''

''ఏయ్ పూజిత్? ఏంటా మాటలు? నన్ను పొందే అర్హతేంటి? ఎవరన్నారసలలా?''

తొలిసారి అతని మదిలో ఏదో సంచలనం. చేయి వేసి ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. చిత్రంగా, ఆ క్షణంలో గాయాల బాధ తెలీలేదు అతనికి!!

★★★

తర్వాత ఆరురోజులపాటు, పూజిత్ పాదానికి నాలుగు ఆపరేషన్లు జరిగాయి. నలిగిపోయిన ఎముకల్ని రీపొజిషన్ చేసి, చిరిగిన లిగమెంట్స్‌ని మరమ్మతు చేసారు. పూజిత్ తల్లిదండ్రులిద్దరూ బాగా వయసు మీదపడ్డవాళ్ళు కావటంతో సౌరభ అన్నీ దగ్గరుండి చూసుకుంటోంది. అతని బెడ్ ప్రక్కనే మరో మంచం వేసుకుని పడుకుంటోంది.

జూన్ 28 న జరిగిన ఆఖరి ఆపరేషన్ తర్వాత, రిహేబిలిటేషన్ ప్రోగ్రామ్‌లో, బరువుల్ని ఎత్తడం సాధన చేసాడు పూజిత్.

అతని పాదానికి సంబంధించి డాక్టర్లు ఇంకా అనిశ్చితంగానే ఉన్నారు! ఎందుకంటే, కణజాలం పెరుగుతోందికానీ, అనుకున్న విధంగా 'ష్రింక్' కావడం లేదది. ఎముకలన్నీ ఒక గట్టిముద్దలా కలిసిపోయి, కాలి నాలుగు వేళ్ళూ కలిసిన చోటు దగ్గర మొనదేలినట్లుగా అయ్యాయి!

అలా ఉన్నా..అది అతని పాదం!! 'ఈ పాదం మీదే నేను నడవాలి. సౌరభతో ఏడడుగులు వేయడం కోసమైనా నేను నడవాలి!'' వాకర్ సాయంతో హాస్పిటల్ హాల్స్‌లో నడుస్తూ అనుకున్నాడు పూజిత్!

★★★

సెప్టెంబరు, 99

వీల్ చెయిర్ చక్రాల్ని, ముందు చేతులతో కాస్త కదిపి చూసుకుని, ఆ తర్వాత బలంగా ముందుకు పోనిచ్చాడు పూజిత్. హాస్పిటల్ నుండి బయటకు రావడం కొత్త ఉత్సాహాన్నిస్తోంది. పూజిత్ వాళ్ళ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌వోనర్స్ అందరూ కల్సి, ఆ ఆదివారం, క్రికెట్ మ్యాచ్ ఆడటం కోసం, ఒక గ్రౌండ్‌కి వచ్చారు. మందుపాతర పేలుడు తర్వాత అదే మొదటిసారి అతనలా బయటకు రావడం. మ్యాచ్ ముగిశాక, ఆటోకోసం రోడ్‌మీదికి వెళ్ళింది సౌరభ పూజిత్‌ని వీల్ చెయిర్లో వదిలి. అతనున్న ప్రదేశం చాలా ఎత్తులో ఉంది. ఆటోని పిలిచి, వెనక్కు తిరిగి చూసింది సౌరభ. ఆమె భృకుటి ముడిపడింది. ఏటవాలుగా ఉన్న ఆ ప్రదేశం నుండి, వీల్‌చెయిర్ వేగంగా క్రిందికి దూసుకువస్తూ కనిపించింది. హఠాత్తుగా, అతను వీల్‌చెయిర్‌ని వదిలేసి, బ్యాండేజ్ కట్టి ఉన్న ఆ కాలుమీద నిలబడిపోయాడు. ఒక్క ఉదుటున పరిగెత్తుకు వెళ్ళింది సౌరభ. అతను నడవాలని, ఆ వీల్ చెయిర్‌ని అందుకోవాలనీ ప్రయత్నిస్తుండగా! ఒకళ్ళిద్దరు, అతని పరిస్థితి చూసి, సాయపడటానికి ముందుకు వస్తే 'వొద్దు' అన్నట్టు తల ఊపాడు! సౌరభ వెళ్ళి, పూజిత్‌ని తన భుజాలమీద వాల్చుకుని, తీసుకువచ్చి ఆటోలో కూర్చోబెట్టింది.

''ఏంటిది పూజిత్?..'' ఆమె ఏడుస్తూ అంటోంది.

''నేను నీకోసం ఎంత కేర్ తీసుకున్నా ప్రయోజనమేంటి నువ్వు నీ గురించి సరిగా జాగ్రత్తపడకపోతే?''

''వీల్ చెయిర్ చక్రం సరిగా పని చేయలేదు సౌరభా...అంతే''

''ఏంటీ? సరిగా పనిచేయలేదా? ఎందుకు అబద్ధం చెబ్తావ్?'' గుప్పిటతో అతని ఛాతీమీద కొడుతూ అంది. ''..ఏదైనా జరగకూడనిది జరిగితే నేనేమైపోవాలనుకున్నావ్ పూజిత్?'' అతనికి కన్నీళ్ళు పొంగుకొస్తున్నాయి. ''సౌరభా, ప్లీజ్! నన్ను క్షమించు. నువ్వు పెళ్ళి చేసుకోవలిసింది నా..నాలాంటి...''

అతని పెదవులమీద తన చేతివేళ్ళను ఉంచింది సౌరభ.

''నో..అలా మాట్లాడకు'' అంది.

''...నాలాంటి అవిటివాడ్ని కాదు సౌరభా. నేను దీన్ని భరించలేకపోతున్నా. నేను నడవాలి''

''నువ్వు నడుస్తావ్ పూజిత్..'' ఆమె చెప్పింది. ''...ఒకవేళ నడవలేకపోయినా, నాకేం ఫర్వాలేదు. నువ్వు ఇలా వీల్ చెయిర్‌లో ఉండటాన్నే నే కోరుకుంటానుగానీ, ఇలా ప్రమాదం కొనితెచ్చుకునేలా ఆవేశంగా ఎగిరిపోవాలనుకోవడాన్ని కాదు. నువ్వు కొంచెం నెమ్మదిగా ఉండాలి పూజిత్. నీ పరిమితుల్ని అర్థం చేసుకోవాలి. అలాగే నా లిమిట్స్‌ని కూడా!''

''అంటే..అంటే నువ్వు నన్ను ఇంకా పెళ్ళి చేసుకోవాలనే అనుకుంటున్నావా. పెళ్ళిపీటల మీదికి నడిచిరాలేకపోయినప్పటికీ?''

''పూజిత్?''

''చెప్పు.నిజమా?''

''షట్ అప్''

★★★

బ్లాస్ట్ జరిగి అప్పటికి ఎనిమిది నెలలు.

ఆరోజు ఫిబ్రవరి 14, 2000.

కళ్యాణవేదిక మీది వివాహమహోత్సవాన్ని చూడడానికి దాదాపు వేయిమందికి పైగా వచ్చి ఉన్నారు. అగ్నిసాక్షిగా, వేద మంత్రోచ్ఛరణాల మధ్య పూజిత్, సౌరభ మెడలో మూడు ముళ్ళు వేసాడు.

సౌరభ ముఖం వెలిగిపోతోంది–కొత్తకాంతితో.

అతనికి ఆపరేషన్స్ చేసిన సర్జన్, ఆ వధూవరుల మీద అక్షింతలు చల్లి చెప్పాడు–సౌరభతో ''కంగ్రాచ్యులేషన్! ఎన్నడూ, ఏ జంట విషయంలోనూ జరగని విధంగా, మీ ప్రేమ అతి క్లిష్టమైన పరీక్షనెదుర్కొంది. అందులో నెగ్గి మరింత తేజోమయమైందది. వాలెంటైన్స్‌డే నాడే వధూవరులుగా మారిన మీ జంట అపూర్వం. గుడ్‌లక్..''

ఇంకా వాపు తగ్గని ఆ కాలుతోనే, పూజిత్ తన తొలి అడుగువేసాడు ముందుకు. బ్యాలెన్స్ కోసం కొంచెం తడబడ్డాడు. ఆ తర్వాత నెమ్మదిగా, సగర్వంగా..ముందు కదిలాడు..తన వధువు చిటికెనవేలితో సహా!

''సౌరభా! నిర్మలమైన ప్రేమకు నిర్వచనమై, నాలో కొత్త జీవం పోసావ్. ఏమిచ్చినా తీరనిది ఈ రుణం. ఈ 'ప్రేమికులరోజు' సాక్షిగా చెబ్తున్నా అయ్ లవ్ యు. అయ్ లవ్ యు ఫ్రమ్ ది వెరీకోరాఫ్ మై హార్ట్, స్వీట్ హార్ట్''

ముక్తాయింపు:

ఏ శుభలేఖా అందుకోకుండా, ఆ వివాహానికి హాజరైన ఒక వ్యక్తి అక్కడ నుండి లేచాడు! అతని కళ్ళు తడిగా ఉన్నాయి!

'యూనిఫామ్‌లో ఉన్న మిమ్మల్ని పోలీస్‌లే అని భ్రమపడి, సమాచారం అందించి, సరిదిద్దుకోలేని తప్పు చేశాను నేను. నన్ను క్షమించగలరా సార్!?' అన్న భావమొకటి అతని కంటి తడిలో కదలాడడాన్ని ఎవరూ గుర్తించలేదు అక్కడ!

ఆ వ్యక్తి కళ్ళు తేనెరంగులో ఉన్నాయి!!

★

